నమస్తే తెలంగాణ
హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
I | హైదరాబాద్, సోమవారం 31 మార్చి 2025 | HYDERABAD

పండుగపూట కరెంట్ కోతలు!



సిటీబ్యూరో, మార్చి 30 (నమస్తే తెలంగాణ): కొత్తపేట మోహన్‌నగర్‌లో రెండుగంటలు, అసిఫ్‌నగర్ జెబాబాగ్‌లో రెండు గంటలు, జీడిమెట్ల కొంపల్లి ఏరియాలో రెండు గంటలు, బోరబండలో గంటకోసారి, సికింద్రాబాద్‌లో విద్యుత్ ఎప్పుడు ఉంటుందో ఎప్పుడు పోతుందో తెలియదు. ఇదంతా అప్రకటిత కరెంట్ కోతల పరిస్థితి. ఉగాది వేళ గ్రేటర్‌లో కరెంట్‌కోతలు ప్రజలకు చికాకు తెప్పించింది. నిరంతర విద్యుత్ సరఫరా అంటూ గప్పాలు కొడుతున్న నేతలకు ఈ పరిస్థితి కనిపించడం లేదా అంటూ పలు ప్రాంతాల ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ముఖ్యంగా ప్రతి ఏరియాలో ఏదో ఒక సమయంలో కరెంట్ తీసేశారంటూ అధికారులకు, సిబ్బందికి ఫోన్లు వచ్చాయి. కానీ స్పందించడంలో మాత్రం తమ సహజవైఖరిని ప్రదర్శించారు. ఈ అప్రకటిత కరెంట్ కోతలకు కారణమేంటా అని విద్యుత్ సిబ్బందిని అడిగితే ఓవర్‌లోడ్ కారణంగా ఫీడర్లు ట్రిప్ అవుతున్నాయని చెప్పారు. కొన్ని చోట్ల ట్రాన్స్‌ఫార్మర్లపై లోడ్ పడి కాలిపోతున్నాయని పేర్కొన్నారు. ఉగాది కొత్త సంవత్సరం, ఓ వైపు బయట ఉష్ణోగ్రతలు పెరుగుతుంటే ఈ కరెంట్ కోతలేంటంటూ నెటిజన్లు సైతం మండిపడ్డారు.

విద్యార్థులను విడుదల చేయాలని పోలీసులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

హెచ్‌సీయూలోకి బుల్డోజర్

భూములు చదును చేసేందుకు వచ్చిన యంత్రాలు.. విద్యార్థుల ఆందోళనలతో అట్టుడికిన వర్సిటీ.. విచక్షణ మరిచిన పోలీసులు

విద్యార్థుల విడుదల కోసం మాదాపూర్ పోలీస్ స్టేషన్ వద్ద ధర్నా చేస్తున్న శ్రీనివాస్‌గౌడ్, దాసోజు శ్రవణ్

విద్యార్థి నాయకులను విడుదల చేయాలంటూ ప్రధాన ద్వారం వద్ద ఆందోళన నిర్వహిస్తున్న విద్యార్థులు

సిటీబ్యూరో/కొండాపూర్/శేరిలింగంపల్లి, మార్చి 30: ఉగాది పర్వదినాన గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ఉద్రిక్తత నెలకొంది. వర్సిటీలోని 400 ఎకరాల భూమిని వేలం వేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం గుర్తించిన భూమిని చదును చేసేందుకు ప్రభుత్వం పెద్ద ఎత్తున ఈస్ట్ క్యాంపస్ వద్ద పోలీసులను మోహరింపజేసింది. దీంతో పాటు జేసీబీలను క్యాంపస్‌లోకి తీసుకువచ్చింది. విషయం తెలుసుకున్న విద్యార్థులు వెంటనే ఈస్ట్ క్యాంపస్ వద్ద ఆందోళన చేపట్టారు. దీంతో పోలీసులు విద్యార్థుల మధ్య తోపులాట జరిగింది. ఆందోళన చేస్తున్న విద్యార్థులను ఈడ్చుకువెళ్లి వ్యాన్‌లలో మాదాపూర్, గచ్చిబౌలి, రాయదుర్గం, కొల్లూరు పోలీస్ స్టేషన్ లకు తరలించారు. విద్యార్థినుల జుట్లు పట్టుకొని, బట్టలు చిరిగిపోయిన వదలకుండా లాక్కెళ్లి పోలీస్ స్టేషన్ తరలించారు. విచక్షణ కోల్పోయిన పోలీసులు.. ఇతర రాష్ట్రాల విద్యార్థులు కావడంతో బూతులు తిట్టినట్లు విద్యార్థులు ఆరోపిస్తున్నారు.

ఈస్ట్ క్యాంపస్ వద్ద ఉద్రిక్తం

ఆదివారం సెలవు దినం కావడంతో విద్యార్థులందరూ హాస్టల్స్‌కు పరిమితమయ్యారు. మధ్యాహ్నం ప్రభుత్వం ఈస్ట్ క్యాంపస్ వద్ద భారీగా పోలీసులను మొహరింపజేసి, 400 ఎకరాల భూమిని చదును చేసేందుకు జేసీబీలు, ట్రక్కులతో సిద్ధమైంది. విషయం తెలుసుకున్న విద్యార్థి సంఘాల ఐక్య కార్యచరణ కమిటీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున అక్కడికి చేరుకున్నారు. సెలవులు ఉన్నాయన్న విషయాన్ని దృష్టిలో పెట్టుకొని అడవిని నాశనం చేస్తున్నారంటూ విద్యార్థులు ఆందోళనకు దిగారు. భూముల వేలాన్ని నిలిపివేయాలని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో పోలీసులు ఆందోళన చేపట్టిన విద్యార్థులను ఈడ్చుకువెళ్లారు. మహిళా విద్యార్థినులని చూడకుండా మహిళా పోలీసులు జుట్టు పట్టుకొని లాక్కెళ్లి వ్యాన్లలో ఎక్కించారు. పోలీసులు దురుసుగా ప్రవర్తించారు. 52 మంది విద్యార్థులను అదుపులోకి తీసుకొని వాహనాల్లో పలు పీఎస్‌లకు తరలించారు.

చిరిగిన దుస్తులు, విద్యార్థులకు గాయాలు..

ఆందోళన చేపట్టిన పలువురిని పోలీసులు కొట్టుకుంటూ తీసుకువెళ్లారని విద్యార్థులు ఆరోపించారు. పోలీసుల దాడిలో పలువురు గాయపడి, స్పృహ తప్పి పడిపోయిన హాస్పిటల్ కి తరలించకుండా పోలీస్ స్టేషన్లోకి తీసుకువెళ్లారంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నిరసన ప్రదర్శనలో సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులు

ఆందోళన చేస్తున్న విద్యార్థులను ఈడ్చుకెళుతున్న పోలీసులు

మెయిన్ గేట్‌కు తాళం..

విషయం తెలుసుకున్న క్యాంపస్‌లోని తోటి విద్యార్థులు ప్రభుత్వానికి, పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ హెచ్‌సీయూ మెయిన్‌గేట్ వద్దకు చేరుకున్నారు. అప్పటికే పోలీసులు క్యాంపస్ మెయిన్ గేట్ కు తాళం వేసి బయటకు రాకుండా అడ్డుకున్నారు. దీంతో ఆగ్రహం చెందిన విద్యార్థులు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. శాంతియుతంగా ఆందోళన చేయనీయరా అంటూ ప్రశ్నిస్తూ ప్రధాన ద్వారం వద్ద బైఠాయించారు. అరెస్ట్ చేసిన విద్యార్థులను వెంటనే విడుదల చేయాలని ఆదోళన చేపట్టారు. పరిస్థితిని మాదాపూర్ డీసీపీ వినీత్‌కుమార్ ఎప్పటికప్పుడూ సమీక్షించారు. వర్సిటీ భూములను యూనివర్సిటీ పేరుపై రిజిస్ట్రేషన్ చేసివ్వాలి డిమాండ్ చేశారు. ఆందోళన చేపట్టిన విద్యార్థులను గుంట నక్కలు అంటూ సీఎం రేవంత్‌అసెంబ్లీలో చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకొని క్షమాపణలు చెప్పాలన్నారు. అరెస్ట్ చేసిన విద్యార్థులను వెంటనే విడుదల చేయాలన్నారు. ఈ డిమాండ్లను నేరవేర్చేవరకూ తమ ఆందోళన కొనసాగిస్తామని ప్రకటించారు. దీంతో పోలీసులు విద్యార్థులను విడుదల చేస్తామంటూ హామీ ఇవ్వడంతో శాంతించారు.

జేసీబీని అడ్డుకొని ఆందోళనకు దిగిన విద్యార్థులు

హెచ్‌సీయూ విద్యార్థులకు పరామర్శ

మాదాపూర్, మార్చి 30: గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల వ్యవహారంపై ఆదివారం విద్యార్థులు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. దీంతో ప్రభుత్వ యంత్రాంగం యంత్రాలతో వర్సిటీ భూములను నాశనం చేసేందుకు వస్తే.. అడ్డుకున్నందుకు విద్యార్థి సంఘాలు నాయకులపై విరుచుకుపడ్డారు. గచ్చిబౌలి పోలీసులు 22 మంది విద్యార్థులను అదుపులోకి తీసుకొని మాదాపూర్ పోలీస్ స్టేషన్ కు తరలించారు. దీంతో బీఆర్ఎస్ మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్, విద్యార్థి నాయకులు పీఎస్‌కు చేరుకొని విద్యార్థులను కలిసి మాట్లాడారు. ప్రభుత్వం వర్సిటీ భూములను ధ్వంసం చేయడం బాధాకరమని బీఆర్ఎస్ మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, ఎమ్మెల్సీ దాసోజు శ్రావణ్ అన్నారు. పచ్చని అడవులను, కొండలను నాశనం చేయడం ఎంతవరకు సమంజసమని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. విద్యార్థుల భవిష్యత్తుతో ప్రభుత్వం ఆడుకుంటుందని, అడ్డుకోబోయిన విద్యార్థులను అక్రమంగా అరెస్టులు చేసి పీఎస్‌కు తరలించడం అన్యాయమని అన్నారు. విద్యార్థులను తక్షణమే వదిలిపెట్టాలని, ప్రభుత్వం తీరు మార్చుకోకుంటే పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కాగా విద్యార్థులను పంపివేస్తున్నట్లు మాదాపూర్ సీఐ కృష్ణమోహన్ తెలిపారు.

భూముల కోసమే సీఎం వద్ద విద్యాశాఖ

సిటీబ్యూరో, మార్చి 30 (నమస్తే తెలంగాణ): వర్సిటీ భూములను అమ్ముకునేందుకే సీఎం రేవంత్ రెడ్డి వద్ద విద్యాశాఖను పెట్టుకున్నారని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కమిటీ ఆరోపించింది. ఆయన ఆదేశాలతోనే వర్సిటీల్లో పోలీసుల రాజ్యమేలుతున్నారని మండిపడ్డారు. ఆదివారం విద్యార్థుల అక్రమ అరెస్టులను నిరసిస్తూ ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శి కసిరెడ్డి మణికంఠ రెడ్డి, పుట్ట లక్ష్మణ్ ఖండిస్తూ ప్రకటన విడుదల చేశారు. మరో 200 మందిని అరెస్టు చేసే ప్రయత్నాలను మానుకోవాలని భారత విద్యార్థి సమాఖ్య(ఎస్ఎఫ్ఐ) ఆందోళన వ్యక్తం చేసింది. భూముల పరిరక్షణ, విద్యార్థుల అక్రమ అరెస్టుకు నిరసిస్తూ రాష్ట్రస్థాయి ఆందోళనకు ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ ఎల్ మూర్తి, కార్యదర్శి టి.నాగరాజు పిలుపునిచ్చిచ్చారు.

సెలవు రోజు ఎందుకొచ్చారు..

వరుస సెలువులు వచ్చిన నేపథ్యంలో విద్యార్థులందరూ క్యాంపస్‌కు పరిమితం అయ్యాం. మధ్యాహ్నంలో ఈస్ట్ క్యాంపస్ వద్దకు భారీగా పోలీసులు చేరుకొని జేసీబీలతో భూమిని చదును చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. అడ్డుకునేందుకు వెళ్లిన తమ స్టూడెంట్ లీడర్లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సెలవు రోజు, అడ్మినిస్ట్రేషన్‌లో ఎవరూ లేని సమయంలో ఎందుకు వచ్చారని పోలీసులను ప్రశ్నిస్తుండగానే అమ్మాయిలు అని చూడకుండా జుట్టు పట్టుకొని లాక్కెళ్లి పోలీస్ వ్యాన్లలో కుక్కారు. కొట్టుకుంటూ తీసుకువెళ్లారు. క్యాంపస్‌లో మోహరించిన పోలీసులు, భూమిని చదును చేసేందుకు వచ్చిన జేసీబీలు వెంటనే వెనక్కి వెళ్లిపోవాలి.

– వెన్నెల, హెచ్‌సీయూ విద్యార్థిని

భూములను వర్సిటీ పేరుపై రిజిస్ట్రేషన్ చేయాలి

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీరును తీవ్రంగా ఖండిస్తున్నాం. సెలవు రోజున విద్యార్థులు లేని సమయంలో క్యాంపస్‌లోకి భారీగా పోలీసులను తీసుకువచ్చి జేసీబీలతో భూమిని చదును చేసేందుకు ప్రయత్నించారు. అడ్డుకునే ప్రయత్నం చేసిన విద్యార్థులను కొట్టుకుంటూ, బట్టలు చింపేసి.. లాక్కెళ్లి వ్యాన్‌లలో ఎక్కించి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పోలీసులు అరెస్ట్ చేసిన విద్యార్థులను వెంటనే విడుదల చేయాలి. 400ల ఎకరాల భూమితో పాటు హెచ్‌సీయూ భూములను వర్సిటీ పేరుపై రిజిస్ట్రేషన్ చేయాలి.

– భీంసేన్, హెచ్‌సీయూ విద్యార్థి

ఎస్పీడీసీఎల్‌లో పనికో రేటు

మీటరు 35 వేలు, ట్రాన్స్‌ఫార్మర్‌కు 3 లక్షలు

విద్యుత్ శాఖలో రాజ్యమేలుతున్న అవినీతి

లక్షలు లంచాలిచ్చి.. ఫోకల్ పోస్టుల్లో తిష్టవేసి

ఫిర్యాదులపై పట్టించుకోని ఉన్నతాధికారులు

సిటీబ్యూరో, మారి 30 (నమస్తే తెలంగాణ): మీటర్ కావాలంటే రూ.35 వేలు.. ట్రాన్స్‌ఫార్మర్ కావాలంటే కెపాసిటీని బట్టి రూ.50 వేల చొప్పున రూ.3లక్షలు.. ఇవి డిపార్ట్‌మెంట్ నిర్ణయించిన ధరలు కావు. కొందరు అధికారులు డిసైడ్ చేసిన రేట్లు. టీజీఎస్‌పీడీసీఎల్ పరిధిలోని గ్రేటర్ శివారు ప్రాంతాల్లో ప్రతి పనికో రేటు నడుస్తోంది. పని కావాలంటే ముందుగా పైసలు ఇవ్వాల్సిందే. లేదంటే ఆ ఫైలే ముందుకు పోదు. దక్షిణ డిస్కం పరిధిలో కొందరు విద్యుత్ అధికారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. ప్యానెల్ బోర్డులు బిగింపు మొదలుకొని మీటర్ల ఏర్పాటు వరకు అన్నీ తామే అయి వ్యవహరిస్తున్నారు. డీఈ, ఏడీఈ, ఏఈ స్థాయి అధికారులు ఒక పని చేయాలంటే తాము నిర్ణయించిన రేటు తమకు దక్కితేనే పనులు చేస్తూ లక్షలు జేబుల్లో వేసుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇటీవల డి.పోచంపల్లి ఏఈ సురేందర్‌రెడ్డి లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా చిక్కారు. గత నెలలో కూడా గచ్చిబౌలి ప్రాంతంలో ఏడీఈ సతీశ్ అపార్ట్‌మెంట్‌లో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు రూ.50వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కాడు. ప్రధానంగా శివారుప్రాంతాల్లోని కొన్ని ఏరియాల్లో పోస్టులకు భలే డిమాండ్ ఉంది. ఇక్కడ పోస్టింగ్ వస్తే ఆ అధికారి పంట పండినట్లేనని, అందుకోసం ఉన్నతాధికారులు, రాజకీయనాయకుల పైరవీతో పోస్టులు దక్కించుకుంటున్నారని విద్యుత్ శాఖ అధికారులే చెబుతున్నారు.

ఫోకల్ పోస్టులకు భలే డిమాండ్!

లంచాల దందా పెరుగుతుందని ప్రతీ మూడేళ్ల కోసారి దక్షిణ డిస్కంలో బదిలీలు జరుగుతుంటాయి. గచ్చిబౌలి, పటాన్‌చెరు, సైబరాబాద్, జీడిమెట్ల తదితర ప్రాంతాల్లో చాలా పోస్టులను కీలకంగా భావిస్తూ వీటిని ఫోకల్ పోస్టులుగా పిలుస్తారు. గత ఏడాది జరిగిన బదిలీల్లో దాదాపు 40 ఫోకల్ పోస్టుల కోసం సిబ్బంది లక్షలు లంచాలిచ్చి దక్కించుకున్నారనే ఆరోపణలున్నాయి. గ్రేటర్‌లో చర్లపల్లి, గచ్చిబౌలి వంటి ప్రాంతాల్లో ఫోకల్ పోస్టులుగా భావిస్తారు. వీటిని దక్కించుకోవడానికి ఎంత డబ్బులైనా అధికారులు వెనకాడడం లేదంటే, ఇక్కడ సైడ్ ఆదాయం ఎంతుంటుందో అర్థం చేసుకోవచ్చు. ఇక శివారు ప్రాంతాల్లో ఉన్న పోస్టులకైతే లక్షల చెల్లించి మరీ పోస్టులు దక్కించుకున్నారని తెలుస్తోంది. తాము తెచ్చుకున్న పోస్టుల డిమాండ్ నేపథ్యంలో అంతే స్థాయిలో వినియోగదారుల అవసరాన్ని బట్టి పెద్ద మొత్తంలో డబ్బు వసూలు చేస్తున్నారు. అయితే వసూళ్లకు చెక్ పెట్టడానికి క్షేత్రస్థాయిలో పర్యటించాల్సిన విద్యుత్ విజిలెన్స్ విభాగం అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు ఉంటున్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ల కెపాసిటీని బట్టి రేటు..

గ్రేటర్ శివారు పారిశ్రామిక ప్రాంతాల్లో అధికారులు ఆడిందే ఆటగా లంచాల దందా సాగుతోంది. కొత్త నిర్మాణాలు చేపట్టినా, పరిశ్రమలు ఏర్పాటుచేసినా వీరి పంట పండినట్లే. 20కిలోవాట్స్ కంటే ఎక్కువగా ఉన్న ప్రాంతాలపై అధికారులు దృష్టిపెట్టి వారి అంచనాలకు సరిసమానంగా లంచాలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. 63కేవీ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలంటే శాఖాపరంగా సుమారు రెండున్నర లక్షలవుతుంది. కానీ ఏర్పాటు కోసం ఏడీఈ స్థాయి అధికారులు మొదలుకొని ఏఈ, డీఈ, లైన్‌మెన్ల వరకు లంచాలు ఇవ్వనిదే ఫైలు కదలడం లేదు. 100 కేవీ, 250కేవీ, 315 కేవీ, 500 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు కావాలంటే అంచనాలతో పాటు అధికారులకూ రూ.50వేల చొప్పున 3లక్షలు చెల్లించాలి. మరోవైపు అన్ని అనుమతులున్న భవనంలోని ఫ్లాట్లకు సింగిల్‌ఫేస్ మీటర్‌కు రూ.3200, త్రిఫేస్‌కు రూ. 8వేలు కట్టాల్సింది. అనుమతుల్లేని అంతస్తుల్లో మీటర్లు ఇప్పిస్తామంటూ సిబ్బంది డిమాండ్‌ను బట్టి మీటరుకు రూ.30 నుంచి 35వేలు అక్రమంగా వసూలు చేస్తున్నారు. ఉన్నతాధికారులకు సదరు లంచగొండ్లపై ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా చర్యల ఊసే లేదని వినియోగదారులు వాపోతున్నారు. కొన్ని డివిజన్లలో అక్రమ ట్రాన్స్‌ఫార్మర్లతో పాటు ప్యానెల్ బోర్డుల ఏర్పాటు మీటర్ల కేటాయింపులు జరుగుతున్నాయని సమాచారం. జీడిమెట్ల, మేడ్చల్, కొండాపూర్ డివిజన్లు, డీపీ పల్లి, గాజులరామారంలో కొంతమంది సిబ్బంది అంచనా లేకుండా ప్యానెల్‌బోర్డులు, విద్యుత్ మీటర్లు ఇస్తామంటూ అవినీతికి పాల్పడుతున్నట్లు దక్షిణ డిస్కం తీసుకొచ్చిన ఫిర్యాదు నబర్లకు మొత్తం 150కి పైగా ఫిర్యాదులొచ్చాయి. శివారు ప్రాంతాల్లోని కొన్ని డివిజన్ల నుంచి పెద్ద సంఖ్యలో ఫిర్యాదులొచ్చినా చర్యలు లేవనే విమర్శలు ఉన్నాయి.

ఆస్తి పన్ను కట్టలేదని.. షాపు ముందు గుంత తవ్వారు

చందానగర్‌లో బల్దియా నిర్వాకం

మియాపూర్, మార్చి 30: ఆస్తిపన్ను బకాయి ఉన్న ఓ వాణిజ్య దుకాణంపై చందానగర్ సర్కిల్ పన్ను విభాగం అధికారులు దారుణానికి ఒడిగట్టారు. పలుమార్లు నోటీసులిచ్చినా యజమాని స్పందించకపోవడంతో, దుకాణం ఎదుట జేసీబీతో గుంత తవ్వారు. ఓ వైపు బట్టల వ్యాపారం కొనసాగుతుండగా శనివారం మధ్యాహ్నం ఆకస్మికంగా వచ్చిన అధికారులు.. దుకాణం ఎదుట బయటికున్న షెడ్డును తొలగించారు. రెండు అడుగుల మేర పెద్ద గుంతను తవ్వారు. కొనుగోలుదారులకు ఇబ్బందులు కలిగించారు. సిబ్బంది, యజమాని బతిమాలినా వినిపించుకోలేదు. దీంతో దుకాణదారు బోరున విలపించాడు. ఉగాది రోజునే అధికారులు ఈ పనికి ఒడిగట్టడం గమనార్హం. అనంతరం యజమాని అధికారులను కలిసి పన్ను చెల్లింపు చేసినట్లు తెలిసింది. కాగా తీసిన గుంతను తిరిగి ఆదివారం దుకాణదారుడు సిబ్బంది తోడ్పాటుతో తిరిగి పూడ్చివేశారు. అయితే ఇంతటి విపరీతమైన చర్యకు దిగిన పన్ను విభాగం అధికారులపై ఉన్నదాధికారులు ఆగ్రహం వ్యక్తం చేసినట్టు సమాచారం. ఇదే సర్కిల్లో మాదాపూర్ పరిధిలో వాణిజ్య భవనంపై రూ.20 లక్షలకు పైగా పన్ను బకాయి ఉండడంతో సీజ్ చేశారు. కానీ గుంతను తవ్వడం అధికార వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఈ చర్య జీహెచ్‌ఎంసీ ప్రతిష్టను దిగజార్చేలా ఉందని విచారం వ్యక్తం చేసినట్లు తెలిసింది.

నగరమంతా ఉగాది సందడి

సిటీబ్యూరో, మార్చి30 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర రాజధానిలో ఉగాది వేడుకలు ప్రజలంతా ఘనంగా జరుపుకున్నారు. విశ్వావసు తెలుగునామ సంవత్సరం ప్రారంభం సందర్భంగా ప్రతి ఒక్కరూ ఇంటిల్లిపాదిగా కలిసి షడ్రుచులు కలిగిన ఉగాది పచ్చడి సేవించారు. కుటుంబసమేతంగా ఆలయాలకు వెళ్లి ఇష్టదైవాలకు అర్చన కార్యక్రమాలు చేయించుకుని, పంచాంగ శ్రవణం విన్నారు. నగర సమీపంలో ఉన్న గ్రామాల నుంచి మామిడికాయలు, మామిడి ఆకులు, వేప ఆకులు, పువ్వులు తీసుకొచ్చి పలువురు రైతులు, వ్యాపారులు నగరంలోని పలు మార్కెట్లు, కూడళ్లలో పండుగ సందర్భంగా విక్రయించారు.

కేబీఆర్ పార్కులో.. పంచె కట్టు వాకింగ్

బంజారా హిల్స్: తెలుగు సంవత్సరాది పురస్కరించుకొని ఉగాది పర్వదినం రోజున తెలుగుదనం ఉట్టిపడేలా కొంతమంది వాకర్లు బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్క్‌లో ఆదివారం పంచె కట్టుతో వాకింగ్‌కు వచ్చారు. ప్రతిరోజు పార్కులో పొట్టి నిక్కర్లు, షార్ట్స్, పాంట్స్‌తో వస్తుంటామని, ఉగాది రోజున తెలుగు సంప్రదాయాన్ని గుర్తుకు తెచ్చుకునేలా పంచకట్టుతో వచ్చామని వాకర్లు పేర్కొన్నారు. అచ్చమైన సంప్రదాయాన్ని కండ్లకు కడుతూ వచ్చిన వారిని పలువురు అభినందించారు.